
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 26 : మార్చి : 2025



.. వాగులో పడిన ట్రాలీ

భేతాళపాడులో టాటా ఏస్ ట్రాలీ అదుపుతప్పి వాగులో పడగా 10 మంది కూలీలు తీవ్రంగా, 13 మంది స్వల్పంగా గాయపడ్డారు. 8లో



గరిష్టం / కనిష్టం
39° / 22°

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఉదయం మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి మరింతగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

భూగర్భజలాల పెంపునకు కృషి చేయండి

డీపీఓ రాజమౌళి

చంద్రుగొండ : భూగర్భజలాలు పెంచేందుకు రైతులు తమవంతు కృషి చేయాలని, వ్యవసాయ క్షేత్రాల్లో బోరుబావుల వద్ద ఫాంపాండ్‌లు నిర్మించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజమౌళి సూచించారు. ఇళ్లలో ఇంకుడుగుంతల నిర్మాణంతోనూ భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. చంద్రుగొండ మండలం తుంగారం, అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన, పెద్దిరెడ్డిగూడెం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. నర్సరీలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాన్, టీఏ రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా అమరనేని



అభివాదం చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్‌గా అమరనేని రామారావు, కన్వీనర్‌గా సంగం వెంకటపుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎంపిక జరగగా, వారు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత, పెండింగ్ పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బకాయిల మంజూరుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

'ఇందిరమ్మ' పనులు ప్రారంభించండి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ శంకర్ తదితరులు

పాల్వంచరూరల్ : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా ఇంకా పునాదులు తీయని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని హౌసింగ్ పీడీ శంకర్ అన్నారు. మండల పరిధిలోని తోగ్గూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలో 200 ఇళ్లు మంజూరైతే 60 మంది మాత్రమే పునాదులు తీసి పనులు చేపట్టారని, మిగిలిన వారు త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఆయన వెంట ఏఈ రమేష్, గ్రామ కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

ఇసుక తిన్నెలే.. పూల పాన్పులు!

శ్రీరామనవమికి సామాన్య భక్తులకు తప్పని ఇక్కట్లు

- దేవస్థానం పరిధిలోని గదులన్నీ ముందే బ్లాక్
- దాతల సహకారంతో నిర్మించినవి కావడమే కారణం
- ప్రైవేట్ సెక్టార్‌లోనీ సింహభాగం ఆన్‌డ్యూటీ అధికారులకే..
- భక్తుల అవసరాలను తీర్చలేకపోతున్న హరిత, టీటీడీ గదులు



గదులు దొరకక కరకట్ట మెట్లపై నిద్రిస్తున్న భక్తులు (ఫైల్)



ఏప్రిల్ 4 నుంచి 7 వరకు గదులన్నీ బ్లాక్ అయినట్టు చూపిస్తున్న దేవస్థానం వెబ్‌సైట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధీనంలో సౌమిత్రి సదనం, మారుతి సదనం, జానకీ సదనం, శ్రీరామ నిలయం, శ్రీరామ సదనంతో పాటు 14 కాటేజీలు ఉన్నాయి. వీటిలో మొత్తం 150 వరకు సింగిల్, డబుల్ బెడ్లతో కూడిన ఏసీ, నాన్ ఏసీ గదులు ఉన్నాయి. వీటి అద్దె ఒక రోజుకు కనిష్టంగా రూ.448 నుంచి గరిష్ఠంగా రూ.2,400 వరకు ఉంటాయి. సీతారాముల దర్శనానికి వచ్చే భక్తులు బస చేసేందుకు ఈ గదులను అద్దెకు ఇస్తారు. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో గదులు బుక్ చేసుకునే సౌలభ్యం ఉంది. దీంతో రాబోయే నవమి నాడు సీతారాముల కల్యాణం కళ్లారా చూసేందుకు భద్రాచలం వచ్చే భక్తులు ఈ గదులు బుక్ చేసుకునేందుకు ప్రయత్నించగా, వారికి నిరాశే ఎదురైంది. ఏప్రిల్ 4, 5, 6, 7 తేదీల్లో దేవస్థానం ఆధీనంలో ఉన్న గదులన్నీ బ్లాక్ అయి ఉన్నాయి.

కరకట్ట మెట్లు, ఇసుక తిన్నెలే దిక్కు..

ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన గదులు, డార్మెటరీలే ప్రస్తుతం సామాన్య భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా తాత్కాలిక ప్రాతిపదికన కరకట్ట దిగువన, విస్టా కాంప్లెక్స్ సమీపంలో భారీ షెడ్లు నిర్మిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఈ షెడ్లు.. ఇక్కడా చోటు లభించకపోతే కరకట్ట మెట్లు, గోదావరి తీరంలో ఉన్న ఇసుక తిన్నెలే దిక్కవుతున్నాయి. ప్రతీ ఏడాది ఈ తంతు జరుగుతున్నా ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించడం లేదు.

ప్రైవేటులోనూ కష్టమే..

భద్రాచలంలో ప్రైవేట్, హోం స్టే విధానంలో సుమారు 600 వరకు గదులు అందుబాటులో ఉన్నాయి. నవమి సందర్భంగా ఉమ్మడి ఖమ్మంతో పాటు పొరుగు జిల్లాలకు చెందిన ప్రభుత్వ సిబ్బంది, పోలీసులు విధి నిర్వహణ నిమిత్తం భద్రాచలం వస్తారు. దీంతో ప్రైవేట్ సెక్టార్‌లో ఉన్న గదుల్లో సగం వరకు సిబ్బందికే సరిపోతున్నాయి. ఇతర భక్తులకు పరిమిత సంఖ్యలోనే గదులు లభిస్తున్నాయి. డిమాండ్ ఎక్కువ, గదులు తక్కువ కావడంతో పర్వదినాల్లో వీటి అద్దె ఒక రాత్రికి రూ.5,000 వరకు చేరుతోంది. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో భక్తితో భద్రాచలం వచ్చే భక్తులు ఈ ధరలు చూసి బెంబేలెత్తున్నారు. మరికొందరు అంత డబ్బు వెచ్చించేందుకు సిద్ధపడినా గదులు దొరకని పరిస్థితి ఉంటోంది. దీంతో తాము ప్రయాణించిన వాహనాల్లోనే నిద్రించి, మరుసటి రోజు గోదావరిలో స్నానం చేసి దర్శనాలకు వెళ్లాల్సి వస్తోంది.

కొత్తవి కావాలి..

భద్రాచలంలో ఉన్న హరిత హోటల్‌లో పరిమిత సంఖ్యలోనే గదులు ఉన్నాయి. శ్రీరామనవమి, ముక్కోటి సమయాల్లో ఉండే డిమాండ్‌కు ఇవి ఏ మూలకూ సరిపోవు. దీంతో చాలా మంది భక్తులు ముందురోజు సమీపంలోని పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మంలో బస చేసి, నవమి రోజు ఉదయం భద్రాచలం వస్తున్నారు. మారిన పరిస్థితులకు తగ్గట్టుగా భద్రాచలంలో సామాన్య భక్తులకు వసతి, బస సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరముంది.

దాతల కోసం..

నాలుగు వందల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన భద్రాచలం దేవస్థానం ఆధీనంలో ఉన్న గదుల్లో సింహభాగం దాతల సహకారంతో నిర్మించినవే. భద్రాచలం సీతారాములకు ప్రపంచ నలుమూలలా భక్తులున్నారు. వీరిలో చాలా మంది భద్రాచలంలో గదుల నిర్మాణానికి తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. వారు భద్రాచలం వచ్చినప్పుడు, లేదా వారు సిఫార్సు లేఖలు ఇచ్చిన భక్తులు ఆయా గదుల్లో బస చేసే వీలు ఉంటుంది. సాధారణ రద్దీ రోజుల్లో ఈ గదులు భక్తులకు ఉపయోగపడుతున్నప్పటికీ శ్రీరామనవమి, ముక్కోటి వంటి పర్వదినాలు, ఇతర పండగ రోజుల్లో వారికి కేటాయించే అవకాశం ఉండడం లేదు. ఇక వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్మించిన సత్రాలు, కాటేజీలు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు.

ముస్తాబవుతున్న భద్రగిరి



బ్రిడ్జి సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం



- స్వాగత ద్వారాలు సిద్ధం
- పూర్తి కావొస్తున్న పెయింటింగ్, ఇతర పనులు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్ర స్వామి కొలువై ఉన్న భద్రగిరి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. భద్రాచలం దేవస్థానంలో శ్రీరామనవమి నవాహ్నిక వసంత ప్రయుక్త బ్రహ్మోత్సవాలు ఈనెల 30న ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 6, 7 తేదీల్లో శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఏడాది రామయ్య కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారనే ప్రచారం నేపథ్యంలో ముందస్తుగానే ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే బ్రిడ్జి సెంటర్, అభయాంజనేయస్వామి పార్కు తదితర ప్రాంతాల్లో స్వాగత ద్వారాలు సిద్ధం కాగా, మరికొన్ని చోట్ల పనులు నడుస్తున్నాయి. రెండో బ్రిడ్జి డివైడర్లకు, మిథిలా స్టేడియంలో కల్యాణ మండపానికి రంగులు వేస్తున్నారు. శాశ్వత స్వాగత ద్వారాల వద్ద గల విగ్రహాలకు ఇప్పటికే రంగులు అద్దారు. ఇక గ్రామపంచాయతీ, ఐటీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శాశ్వత మరుగుదొడ్ల పనులు వేగవంతం చేశారు. ఈనెల 30 నాటికి పూర్తి కావాలని ఇప్పటికే కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. ఇంకా తాత్కాలిక మరుగుదొడ్లు, పట్టణంలో పారిశుద్ధ్య పనులు, స్టేడియంలో సెక్టార్ల విభజన, బారికేడ్ల నిర్మాణం వంటివి పెండింగ్‌లో ఉన్నాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

200 క్వింటాళ్ల తలంబ్రాలు..

ఈ ఏడాది భక్తుల కోసం 200 క్వింటాళ్ల తలంబ్రాలు సిద్ధం చేస్తున్నారు. ఇక స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారు చేయాల్సి ఉంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని సరిపడా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇక ముత్యాల తలంబ్రాలను కార్గో ద్వారా భక్తుల ఇంటికే చేరుస్తామని ఆర్టీసీ అధికారులు ప్రకటించగా, పరోక్ష సేవల్లో భాగంగా తలంబ్రాలు, అర్చనలకు సంబంధించి ఈ నెల 31 వరకు తపాలా శాఖ అందించనుంది.

ఉపాధి పనులతో ఆసరా



ఉపాధి పనుల్లో భాగంగా మట్టి ఎత్తుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కూలీలతో కలిసి పలుగు, పార పట్టిన కలెక్టర్



కలెక్టర్‌తో కలిసి మట్టి ఎత్తిపోస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

చుంచుపల్లి/టేకులపల్లి : ఉపాధిహామీ పథకం గ్రామాల్లో పేదలకు ఆసరాగా నిలుస్తోందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన చుంచుపల్లి మండలం నందాతండా, టేకులపల్లి మండలం బోడు, ఎర్రాయిగూడెంలో ఈజీఎస్ పనులను పరిశీలించారు. పలుగు, పార పట్టి కాసేపు మట్టి పనులు చేస్తూ కూలీలను ఉత్సాహపరిచారు. ఫారం పాండ్స్‌తో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. వేసవిలో నీటి ఎద్దడి దృష్ట్యా రైతులంతా ఫారం పాండ్స్ నిర్మించుకోవాలని సూచించారు. ఎక్కువ ఆదాయం వచ్చే మునగ పంట సాగు చేయాలన్నారు. ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కుటుంబం 100 రోజులు పూర్తి చేసుకోవాలని, రోజుకు రూ.300 గిట్టుబాటయ్యేలా పని చేయాలని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, చుంచుపల్లి ఎంపీడీఓ సుభాషిని, ఎంపీఓ సత్యనారాయణ, ఏపీఓ రఘుపతి, టేకులపల్లి ఎంపీడీఓ జి.రవీందర్, ఎంపీఓ గాంధీ, ఏఓ అన్నపూర్ణ, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, టీఏ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మా రోడ్డు దుస్థితి చూడండి సారూ

టేకులపల్లి మండలంలో కలెక్టర్ పాటిల్ పర్యటన సందర్భంగా రేగులతండా, దాసుతండా వాసులు తమ గోడు వెల్లబోసుకున్నారు. రెండేళ్లుగా నిర్మిస్తున్న రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇక మట్టి రోడ్డుపై వెళ్లే బొగ్గు లారీలతో దుమ్ము, ధూళి ఎగిసిపడి అనారోగ్యాల పాలవుతున్నామని, సింగరేణి అధికారులు కనీసం రోడ్డుపై నీళ్లు కూడా చల్లించడం లేదని చెప్పారు. దీంతో అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్.. వారం రోజుల్లో పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు.

భక్తులు ఇబ్బంది పడకుండా చూడాలి

ఆర్టీసీ ఈడీ కుస్రో షా ఖాన్



మాట్లాడుతున్న కుస్రో షా ఖాన్, పక్కన ఆర్‌ఎం సరిరామ్ తదితరులు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారని, వారికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా బస్సులు ఏర్పాటు చేయాలని టీజీఎస్‌ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ కుస్రో షా ఖాన్ అన్నారు. సంస్థ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్యాణానికి వచ్చిన ప్రతీ భక్తుడిని తిరిగి వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చాలని, అందుకు ఆర్టీసీ ఉద్యోగులంతా కృషి చేసి ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచించారు. భద్రాచలం – పర్ణశాల మధ్య కూడా అధిక సంఖ్యలో బస్సులు నడపాలని, తెలంగాణలోని అన్ని రూట్ల ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం, భద్రాద్రి జిల్లాలతో పాటు ఏపీ నుంచి వివిధ డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిని ప్రపంచానికి చాటాలి

మంత్రి పొంగులేటి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రులు పొంగులేటి, సీతక్క తదితరులు

భద్రాచలం : గిరిజనుల సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేయాలని, భద్రాచలంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతో దీనికి మరింత అవకాశం ఏర్పడిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాచలం ట్రైబల్ మ్యూజియం బ్రోచర్‌ను శాసనసభ ఆవరణలో మంత్రి సీతక్కతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన సంప్రదాయాలు, వేషభాషలు, జీవన విధానాన్ని ప్రదర్శించేందుకు మ్యూజియం ఉపకరిస్తుందన్నారు. తద్వారా భద్రాచలం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీరామనవమి వేడుకల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మ్యూజియాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య పాల్గొన్నారు.

మ్యాన్ రైడింగ్ పనులు పూర్తి చేయాలి

మణుగూరు టౌన్: సింగరేణి కేపీయూజీ మ్యాన్ రైడింగ్ సిస్టం పనులు పటిష్టంగా, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం ఏరియాలో పర్యటించిన ఆయన జీఎం దుర్గం రాంచందర్, పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్‌తో కలిసి కేపీయూజీ మైన్‌ను సందర్శించారు. గని భౌగోళిక బొంగ పరిస్థితిపై వివరాలు ఆరా తీశారు. అనంతరం ఓసీ–2 వ్యూ పాయింట్ వద్ద బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత పనులను పరిశీలించి భారీ యంత్రాల పనిగంటలను పూర్తిస్థాయిలో వినియోగించాలని, లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కొండాపురం ఏజంట్ వీరభద్రరావు, అధికారులు ఆర్. శ్రీనివాస్, వీరభద్రుడు, సురేశ్, నర్సింహారావు, చిట్టా శ్రీనివాస్, రాజేశ్వరరావు, ప్రశాంత్, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

వైద్యులు, సిబ్బంది సేవలు భేష్

- ఇల్లెందు ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం
- అవార్డుకు ప్రతిపాదనలు



ఆస్పత్రిలో పరిశీలిస్తున్న కాయకల్ప బృందం

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది ఉత్తమ సేవలు అందిస్తున్నారని వైరా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బాలునాయక్ బృందం కితాబిచ్చింది. కాయకల్ప కార్యక్రమంలో భాగంగా ఈ బృందం మంగళవారం ఇల్లెందు ఆస్పత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా బాలునాయక్ తదితరులు ఆస్పత్రిలోని అన్ని వార్డులను తనిఖీ చేసి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ వార్డులో ఉన్న సదుపాయాలు, ఆస్పత్రిలో లేబర్ రూం, ల్యాబ్‌లు, మందుల గదులతో పాటు ఓపీ, పిల్లల వార్డును పరిశీలించారు. శానిటేషన్, తాగు నీరు, విద్యుత్, పేషెంట్ల రాక, వారికి అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పేషెంట్లు అధికంగా వస్తుండడాన్ని చూసి ఆశ్చర్యపోయారు. అయితే ఆస్పత్రి భవనం, కిటికీలు, తలుపులు అంత బాగా లేకపోవడంతో కొంత లోటని పేర్కొన్నారు. మొత్తంగా 70 శాతం మేర మార్కులు వేస్తున్నట్లు తెలిపారు. కాగా, వీరు అందించే నివేదిక ప్రకారం కాయకల్ప పథకం వర్తిస్తే.. ఆస్పత్రి అభివృద్ధికి ఏడాదికి రూ.1.50 లక్షల వరకు మంజూరయ్యే అవకాశం ఉంది. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, ఎండీలు రాంనివాస్, శేఖర్, ఆర్‌ఎంఓ డాక్టర్ బన్నీ, హెడ్ సిస్టర్ నాగేంద్రమ్మ, ఫార్మసిస్ట్ రజనీ, ఆఫీస్ ఇన్‌చార్జ్ రాహుల్ పాల్గొన్నారు.

ఎగిసిపడిన 'భగీరథ'



పైప్‌లైన్‌కు రంధ్రం పడడంతో ఎగిసిపడుతున్న నీరు

ఇల్లెందురూరల్ : మండలంలోని తిలక్‌నగర్‌లో విద్యుత్ లైన్‌ను ఎర్త్ అమర్చే పనులను ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం చేపట్టారు. ఇందుకోసం ట్రాక్టర్ సహాయంతో రంధ్రాలు చేస్తుండగా మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు తగిలి నీరు ఒక్కసారిగా ఎగిసిపడింది. వరద ప్రవాహం భారీగా పెరగడంతో రెండిళ్లు పూర్తిగా జలమయమయ్యాయి. అయ్యోరి రామానుజమ్మ ఇంట్లోకి వరదనీరు చేరి సామగ్రి మొత్తం తడిసి మద్దయింది. జీడి జనార్దన్ ఇంటిని కూడా వరదనీరు చుట్టుముట్టగా అప్రమత్తమైన మిషన్ భగీరథ అధికారులు నీటి సరఫరా నిలిపేశారు. పైపులైన్ లీకేజీతో జలం ఆకాశమంత ఎత్తున ఎగిసి పడటంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు.

కలెక్టరేట్‌కు కొత్త అందాలు!



భద్రాద్రి జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జిల్లా సమీకృత అధికారుల సముదాయం(ఐడీఓసీ–కలెక్టరేట్)కు సరికొత్త సొబగులు అద్దుతున్నారు. ఇక్కడ ఉండే వనాలు, వన్యప్రాణులు, గిరిజనుల బొమ్మలను కలెక్టరేట్ ముందు ఉన్న పార్కులో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పచ్చని మొక్కలతో కూడిన గార్డెన్లతో కళకళలాడుతున్న కలెక్టరేట్.. ఈ బొమ్మలతో కొత్త ఆకర్షణను సంతరించుకుంటోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి నేడు, రేపు ఎంపిక పోటీలు

భద్రాచలంటౌన్/పాల్వంచరూరల్/గుండాల: పాల్వంచ మండలం కిన్నెరసాని, గుండాల మండలం కాచనపల్లిలోని గిరిజన ఆశ్రమ క్రీడా పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు చివరి దశ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. కిన్నెరసానిలో బాలురకు ప్రవేశాలు కల్పించేందుకు బుధవారం, కాచనపల్లి పాఠశాలలో బాలికలకు ప్రవేశాలు కల్పించేందుకు గురువారం ఆయా పాఠశాలల్లో ఎంపిక పోటీలు ఉంటాయని వెల్లడించారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులే కాక ఆసక్తి ఉన్న వారు నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌ఫొటోలు, టీషర్ట్‌తో నిర్ణీత తేదీల్లో ఉదయం 8.30 గంటలకల్లా హాజరు కావాలని వారు సూచించారు. ఈ మేరకు తొమ్మిది రకాల బ్యాటరీ టెస్ట్ ద్వారా ఎంపికలు ఉంటాయని పీఓ వివరించారు.

కొత్తగూడెం ఏరియాలో రికార్డుస్థాయి బొగ్గు రవాణా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో రికార్డ్‌స్థాయిలో బొగ్గు రవాణా సాధించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలో సోమవారం ఒక్కరోజు 68,056 వేల టన్నుల బొగ్గును రవాణా చేసి రికార్డ్ నెలకొల్పామని, సింగరేణి చరిత్రలో ఏ ఏరియా కూడా ఇప్పటివరకు ఒక్కరోజులో 14 రేకులను రవాణా చేయలేదని పేర్కొన్నారు. సమంత సీహెచ్‌పీలో 10 రేకులు, రుద్రంపూర్‌లోని సీహెచ్‌పీ నుంచి 4 రేకులు రవాణా చేశారని వివరించారు. ఇదే స్ఫూర్తితో వార్షిక లక్ష్యాన్ని సాధించాలని, జీరో యాక్సిడెంట్‌కు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

టేకులపల్లి సంత వేలం రూ.11.60 లక్షలు



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

టేకులపల్లి: టేకులపల్లి, గోలియాతండా గ్రామ పంచాయతీల సంయుక్త వారాంతపు సంత నిర్వహణకు సంబంధించిన వేలం పాట మంగళవారం టేకులపల్లి పంచాయతీ కార్యాలయంలో జరిగింది. మొత్తం 8 మంది డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనగా రూ.11.60 లక్షలకు మూడు వాసు కైవసం చేసుకున్నారు. కిందటిసారి 9 నెలలకు గాను సంత వేలం రూ.8 లక్షలకు పాడారు. ప్రస్తుత సంత కాలపరిమితి ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉంటుంది. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రవీందర్‌రావు, ఎంపీఓ జేఎల్ గాంధీ, కార్యదర్శులు ఉప్పు దీప్తి, ప్రశాంత్, సిబ్బంది మూడు బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం

పాల్వంచ: స్థానిక డీఏవీ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు ఎంఎస్‌వీ కృష్ణారావును అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం వరించింది. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 13న గుంటూరులో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు తనకు అందజేస్తారని కృష్ణారావు మంగళవారం వెల్లడించారు.

ఉపాధ్యాయుడిపై దాడి?

దుమ్ముగూడెం: మండలంలోని పాత జిన్నెలగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, కాశీనగరం గ్రామానికి చెందిన విజయ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి 8 గంటల సమయాన దాడి చేసినట్లు సమాచారం. పాఠశాలకు అవసరమైన సామగ్రిని ఆటోలో తీసుకెళ్లి దింపి తిరిగివస్తుండగా బురకనగడ్డ సమీపాన ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తులు దాడి చేసినట్లు తెలిసింది. 'నువ్వు ఎవరో తెలుసు.. ఎందుకు వస్తున్నావో తెలుసు.. ఇంకోసారి ఇటువైపు వస్తే ప్రాణాలు పోతాయి జాగ్రత్త' అని హెచ్చరించారని, ఈలోగా ఇతరవాహనాలు వస్తుండడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారని సమాచారం. కాగా, విజయ్ గతంలో పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి ప్రస్తుతం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఉపాధ్యాయుడిపై దాడికి కారణం వ్యక్తిగత కక్షలా ఇతర కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది.

వడదెబ్బతో రైతు మృతి



గోబ్రియా (ఫైల్)

టేకులపల్లి: వడదెబ్బతో రైతు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని మద్రాస్‌తండా పంచాయతీ కొండంగుల బోడు గ్రామానికి చెందిన కేలోతు గోబ్రియా (49) కూరగాయలు, నువ్వులు సాగు చేశాడు. సోమవారం చేనుకెళ్లి ఎండలోనే కూరగాయలు, నువ్వులు కోశాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో అస్వస్థతకు గురై ఇంటికొచ్చాడు. మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య బుజ్జి, ఒక పాప, బాబు ఉన్నారు. కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

ఇంజనీర్ల బదిలీలెప్పుడో..?

- జెన్‌కోలో పైరవీలు చేసేవారికి పోస్టింగ్‌లు..
- గతానికి భిన్నంగా ప్రస్తుత పరిస్థితులు
- ప్రత్యేక సీఎండీ లేక పరిష్కారం కావడం లేదనే ఆరోపణలు
- రాష్ట్రంలోని మూడు సీఈ పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లే..



పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్

పాల్వంచ: టీఎస్ జెన్‌కోలో పనిచేస్తున్న ఇంజనీర్ల సమస్యలు ఎక్కడివక్కడే ఉండిపోతున్నాయి. యాజమాన్యం కనీసం పట్టించుకోవడం లేదని ఇంజనీర్లు, సంఘాల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. సంస్థ పురోభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తున్న ఇంజనీర్లపై వివక్ష చూపిస్తున్నట్లు సమాచారం. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని వాపోతున్నారు. పదోన్నతులతో పాటే బదిలీలు చేపట్టాల్సి ఉండగా పదోన్నతులు వచ్చి నెలలు గడుస్తున్నా పోస్టింగ్ లేకపోవడం గమనార్హం. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు మంత్రులు, యాజమాన్యాలకు కలిసి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా పైరవీలు చేసుకుంటున్న వారు మాత్రం మంచి పోస్టింగ్‌లు పొందుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

సీఎండీ ఉండాలి..

జెన్‌కోకు ప్రత్యేక సీఎండీ లేకపోవడం ఇంజనీర్ల సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. ఎనర్జీ, పంచాయతీ రాజ్, ఫైనాన్స్ సెక్రటరీగా ఉన్న అధికారే జెన్‌కో సీఎండీగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయన ఈ శాఖ సమస్యలపై సరిగ్గా దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇంజనీర్ల సమస్యలపై ఇంజనీర్ల సంఘాలు ఇప్పటికే అనేక మార్లు వినతిపత్రాలను సమర్పించారు. రేపు, ఆ తర్వాత కూడా విద్యుత్ శాఖ మంత్రి అయిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రుల దృష్టికి ఇంజనీర్ల సమస్యలను తీసుకుపోనున్నారు. అయినా, సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రత్యక్ష ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

ఇన్‌చార్జ్‌లతో సీఈ పోస్టుల భర్తీ

జెన్‌కోలో మూడు చీఫ్ ఇంజనీర్ పోస్టులు సైతం ఇన్‌చార్జ్‌లతో నడుస్తుండటం గమనార్హం. పాల్వంచలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కేటీపీఎస్ 7వ దశలో పనిచేసే చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు జనవరి 31న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు 7వ దశ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇదిలాఉండగా హైదరాబాద్ విద్యుత్ సౌధలో ఈఆర్‌సీ సీఈ టీఎస్ఎన్ మూర్తి సైతం జనవరి 31న ఉద్యోగ విరమణ పొందారు. ఫిబ్రవరి 28న కమర్షియల్ సీఈ ఆనందం ఉద్యోగ విరమణ చెందారు. ముగ్గురు సీఈలు ఉద్యోగ విరమణ పొందినా ఇంకా ఆయా పోస్టుల్లో ఎవరినీ భర్తీ చేయలేదు. ఇతర సీనియార్టీ ఉన్న ఎస్ఈలకు కూడా పదోన్నతులు ఇవ్వలేదు.

వినతులు బుట్టదాఖలు

జెన్‌కోవ్యాప్తంగా గత అక్టోబర్ 14వ తేదీన 205 మంది ఇంజనీర్లు పదోన్నతులు పొందారు. ఇందులో ఏఈలు ఏడీఈలుగా, ఏడీఈలు డీఈలుగా, డీఈలు ఈఈలుగా, ఈఈలు ఎస్ఈలుగా పదోన్నతులు పొందారు. ఇక 2012 బ్యాచ్‌కు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్లు ఏడీలుగా పదోన్నతులు పొంది ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పోస్టింగ్‌లు లభించలేదు. నాలుగేళ్లుగా జెన్‌కోలో ఇంజనీర్లకు ట్రాన్స్‌ఫర్లు కూడా ఇవ్వడం లేదు. రిటైర్‌మెంట్ ద్వారా ఖాళీ అయిన చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్ల పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా వాటిని పట్టించుకోవడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ఉన్నతాధికారులతో పైరవీలు చేసుకుని కొందరు ఇంజనీర్లు బదిలీలు చేయించుకున్నారు. కాగా, అక్రమంగా విద్యుత్ సౌధకు ఇచ్చిన ట్రాన్స్‌ఫర్లను రద్దు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. విద్యుత్ సౌధకు బదిలీ కావాలంటే గతంలో సీనియార్టీ ప్రాతిపదికన మాత్రమే బదిలీలు జరిగేవి. కానీ, ఇటీవలికాలంలో పైరవీ ఉన్న వారికి పోస్టింగులు వస్తుండటం గమనార్హం.

అదుపుతప్పి వాగులో పడిన ట్రాలీ

- 10 మంది కూలీలకు తీవ్రంగా, 13 మందికి స్వల్పంగా గాయాలు
- భేతాళపాడులో వద్ద ప్రమాదం



వాగులో పడిన ట్రాలీ

జూలూరుపాడు: మొక్కజొన్న కంకులు విరిసేందుకు వెళ్తున్న కూలీల ట్రాలీ అదుపుతప్పి వాగులో పడడంతో పలువురు గాయపడిన ఘటన మండల పరిధిలోని భేతాళపాడులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏన్కూరు మండలం రాజులపాలెం గ్రామానికి చెందిన ఓ రైతు చేనులో మొక్కజొన్న కంకులు విరిసేందుకు జూలూరుపాడు మండలం చీపురుగూడెం, టాక్యాతండా, ఎలుకలొడ్డు గ్రామాలకు చెందిన 31 మంది కూలీలు చీపురుగూడేనికి చెందిన టాటా ఏస్ ట్రాలీ ఎక్కారు. భేతాళపాడు సమీపంలోని పెద్దవాగు బ్రిడ్జి వద్దకు రాగానే ట్రాలీ ముందు టైర్ బరస్ట్ కావడంతో అదుపుతప్పి వాగులో పడిపోయింది. దీంతో కూలీలు చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ ప్రమాదంలో 10 మందికి తీవ్రంగా, మరో 13 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న 108 వాహనంలో ముగ్గురిని, మిగితా వారిని మరో వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోడె శేఖర్, సోడె లక్ష్మీనారాయణ, వజ్జా పగడయ్య, వజ్జా సత్యం, బల్లెం రమేశ్, బొర్రా రాఘవులు, బానోత్ సురేశ్‌బాబు, బచ్చల అజయ్, కోడెం వెంకటేశ్వర్లు, సోడె లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వారిలో శేఖర్, లక్ష్మీనారాయణ, బచ్చల అజయ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఆస్పత్రికి తరలించారు. టాక్యాతండాకు చెందిన బానోత్ సురేశ్‌బాబు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ట్రాలీ డ్రైవర్ పాయం సాయికి స్వల్ప గాయాలయ్యాయి.

పరిమితికి మించి ప్రయాణం..

టాటాఏస్ ట్రాలీ వాహనంలో పరిమితికి మించి 31 మంది కూలీలు ఎక్కగా భేతాళపాడు వద్ద టైర్లకు ఫుల్‌గా గాలి పెట్టించాడు. ఆ తర్వాత కాసేపటికే వాహనం ఎడమ వైపు ముందు టైర్ బరస్ట్ కావడంతో అదుపుతప్పి బ్రిడ్జి కుడి వైపున వాగులో బోల్తా పడింది. అయితే వాగులో నీళ్లు లేకపోవడం, బ్రిడ్జి మొదట్లోనే పడడంతో పెనుప్రమాదం తప్పింది. బ్రిడ్జికి ఇరువైపులా రెయిలింగ్ సక్రమంగా లేకపోవడం కూడా ప్రమాదానికి కారణమైందని స్థానికులు అంటున్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఫోన్ ద్వారా బాధితులను పరామర్శించారు. జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా గాయపడిన వారిని వివిధ పార్టీల నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాళోత్ మంగీలాల్, జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మా, ఎం.రాజశేఖర్, గాని నాగేశ్వరరావు, వల్లోజి రమేశ్, ప్రణయ్ తదితరులు పరామర్శించారు.

హాస్టల్ తాళం పగులగొట్టిన అధికారులు



తాళం పగులగొట్టిస్తున్న అధికారులు

మణుగూరుటౌన్: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌ను బదిలీ చేసినా వెళ్లకుండా ఇన్‌చార్జి వార్డెన్‌కు బాధ్యతలు అప్పగించకుండా నిర్లక్ష్యం చేస్తుండటంతో హాస్టల్‌లో పంచనామా నిర్వహించి ఇన్‌చార్జ్‌కి బాధ్యతలు అప్పగించిన ఘటన మణుగూరులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం, మెనూ పాటించకపోవడం, అందుబాటులో ఉండకపోవడం, అధికారులతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను జిల్లా అధికారులు డిప్యూటేషన్‌పై గతేడాది డిసెంబర్‌లో భద్రాచలం బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్‌గా రాంబాబును నియమించగా ఆయనకు తాళాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఈ నేపథ్యంలో వార్డెన్ శ్రీనివాస్‌ను సస్పెండ్‌చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి మొదటి తప్పుగా క్షమించాలని కోరడంతో వార్డెన్‌ని అశ్వారావుపేట బదిలీ చేశారు. అయినా నాటి నుంచి నేటి వరకు మణుగూరు ఎస్సీ బాలుర హాస్టల్ తాళాలు ఇన్‌చార్జ్ వార్డెన్‌కు అప్పగించకుండా తాత్సారం చేస్తుండటంతో ఫోన్ చేసినా అందుబాటులో లేనంటూ సమాధానం చెబుతూ పిల్లలకు వారానికి సరిపడా సరుకులు ఇస్తూ వస్తున్నాడు. దీంతో ఇన్‌చార్జ్‌గా నియమితులైన వార్డెన్ రాంబాబు తరచూ హాస్టల్‌కి రావడం తాళాలు వేసి ఉండటంతో వెనుదిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఏఎస్‌డబ్ల్యూఓ హనుమంతరావు, ఆర్ఐ గోపి, సమితిసింగారం సెక్రటరీ శ్రీకాంత్ సమక్షంలో హాస్టల్ తాళాలు పగులగొట్టి సామగ్రిపై పంచనామా నిర్వహించి ఇన్‌చార్జ్ వార్డెన్ రాంబాబుకి బాధ్యతలు అప్పగించారు.

అ'పూర్వ' కలయిక



సమావేశంలో పూర్వ విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: 50 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. పట్టణంలోని పి.ఆర్.ఫంక్షన్ హాల్లో మంగళవారం శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1972 నుంచి 1975 వరకు బీకాం చదువుకున్న పూర్వ విద్యార్థుల అ'పూర్వ'సమ్మేళనం నిర్వహించగా నాడు డిగ్రీ చదువుకున్న 27 మంది కలుసుకున్నారు. నాడు చదువు చెప్పిన ప్రిన్సిపాల్ రాఘురామారావు, లెక్చరర్ సుఖదేవ్, సుబ్రహ్మణ్యం, మాధవరావు, మురళిమోహన్‌కు పూర్వ విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం లెక్చరర్లు కృష్ణయ్య, శంకర్‌రావును సత్కరించారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్‌రావు, ప్రసన్నకుమార్, రాఘవరావు, అక్బర్, సాంబశివరావు, ప్రభాకర్‌రావు, సత్యనారాయణ, రామస్వామి, మహేశ్, శ్రీనివాస్, సాంబశివగుప్త, రోశయ్య, రాజేంద్రప్రసాద్, రవీంద్రకుమార్, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్, గుమ్మడి వెంకటేశ్వరరావు, శంకర్, లక్ష్మీనారాయణ, నిరంజన్‌కుమార్, రాము, సంక్రాంతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత



డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న పశువులు

అశ్వారావుపేటరూరల్: కబేళాకు తరలిస్తున్న పశువులను మంగళవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లా పార్వతీపురం సంత నుంచి డీసీఎం వ్యాన్‌లో అనుమతి లేకుండా 40 ఎద్దులు, 32 ఆవులను హైదారాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా అశ్వారావుపేటలోని రింగ్ రోడ్ సెంటర్‌లో పట్టుకున్నారు. వ్యాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, పార్వతీపురానికి చెందిన కె.అంజి, గుబ్బల ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పశువులను ఏపీలోని రాజమండ్రి గోసంరక్షణ కేంద్రానికి తరలించి, వ్యాన్‌ను సీజ్ చేశామని చెప్పారు.

రెండు కార్లను దహనం చేసిన దుండగులు

సింగరేణి యాజమాన్యమే చేయించిందని బాధితుడి ఆరోపణ



పూర్తిగా కాలిపోయిన కార్లు

కొత్తగూడెంటౌన్: ఆరుబయట పార్క్ చేసిన రెండు కార్లను గుర్తుతెలియని దుండగులు దహనం చేసిన ఘటన మంగళవారం తెల్లవారుజామున రామవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు జీకే సంపత్‌కుమార్, పోలీసుల కథనం ప్రకారం.. రామవరం సుభాష్‌చంద్రబోస్‌నగర్ కాలనీలో పార్క్ చేసిన సంపత్‌కుమార్ కారుకు తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు పక్కనే ఉన్న వీరుకు చెందిన కారుకు అంటుకున్నాయి. చుట్టుపక్కల పొగ వ్యాపించడంతో సంపత్‌కుమార్ అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేందుకు యత్నించాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకునేలోగానే రెండు కార్లు పూర్తిగాకాపోయాయి. టూటౌన్ సీఐ రమేశ్‌కుమార్, క్లూస్ టీం వివరాలు సేకరించారు. సీసీ కెమెరా పరిశీలించగా ఆగంతకులు తచ్చాడుతున్నట్లు కనిపించిందని, చీకటి ఉండటంతో స్పష్టంగా కనిపించలేదని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. జీకే సంపత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. కాగా, సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో తాను సింగరేణి సంస్థపై కేసు వేశానని, తనను భయపెట్టేందుకే సింగరేణి యాజమాన్యం ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు ఆరోపించారు. కేసు విషయంలో బుధవారం హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉందని తెలిపారు.

పంచాయతీ మోటార్లు దగ్ధం



కాలిపోయిన మోటార్లను పరిశీలిస్తున్న అధికారులు

పినపాక: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పంచాయతీ మోటార్లు కాలిపోయిన ఘటన మండలంలోని జానంపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పంచాయతీ అధికారుల కథనం ప్రకారం.. జానంపేట జెడ్పీహెచ్ఎస్ ప్రాంగణంలో మూడు మోటార్లు ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు వరిదొప్పలు కొన్ని మండించడంతో ఆ మంటలు వ్యాపించి మోటార్లు, వైర్లు, పైపులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని పంచాయతీ అధికారులు తెలిపారు.

ట్రాక్టర్ టైరు పంక్చర్

అదుపుతప్పి చెట్టుకు ఢీ



చెట్టును ఢీకొట్టిన ట్రాక్టర్

చర్ల: మండలంలోని ఉంజుపల్లిరోడ్‌లో మంగళవారం కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ ముందు చక్రం టైరు పంక్చర్ అయ్యి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఒకరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్ పరిధిలోని కమలాపురానికి చెందిన కొందరు ఆదివాసీలు వెంకటచెరువులోని బంధువుల ఇళ్లల్లో ఉంటూ మండలంలోని వివిధ గ్రామాలకు కూలీ పనులకు వెళ్తున్నారు. వారు ట్రాక్టర్‌లో వెంకటచెరువు నుంచి చీమలపాడుకు వెళ్తుండగా దేవరబండ సమీపంలో ట్రాక్టర్ ముందు చక్రం టైరు పంక్చర్ అయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కమలాపురానికి చెందిన సోడి లక్మ గాయపడగా.. 108 ద్వారా చర్ల ప్రభుత్వ వైద్యశాలకు.. అక్కడి నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సయ్యద్ అక్బర్ మృతదేహం

గుండాల: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ అక్బర్ (45) గుండాలకు తునికాకు ప్రూనింగ్ పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. గుండాల – దుబ్బగూడెం మధ్య మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడటంతో అక్బర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న సీఐ మృతదేహాన్ని ములుగు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో గల సీతారాంనగర్ కాలనీకి చెందిన సాయిరాం గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సాయిరాం ఇటీవల రోడ్డు ప్రమాదం నుంచి బయటపడి కోలుకుంటున్నాడు. పెళ్లికాకపోవడం, తన తండ్రి మృతిచెందడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. జీవితం విరక్తి చెందిన ఈ నెల 24న మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం భద్రాచలం బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో వెతకగా బండరాళ్లపై విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు తెలపగా ఘటనా స్థలానికి చెరుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడి తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వరి గడ్డివామి దగ్ధం



దగ్ధమవుతున్న వరి గడ్డి

పినపాక: ప్రమాదవశాత్తు వరి గడ్డివామి పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలోని అమరావరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత రైతు మహ్మద్ ముజాఫర్ కథనం ప్రకారం.. పొలంలో మూడు ఎకరాలకు సంబంధించిన వరిగడ్డిని పశువుల మేత కోసమని కుప్పగా వేశారు. ప్రమాదవశాత్తు వామికి మంటలు అంటుకోవడంతో గమనించిన రైతులు ఆర్పే ప్రయత్నం చేసేలోపు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.60 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.